ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 5-12-97)**

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

మనం ఉండగలిగినంత మంచిగా ఉంటూ, వివేకంగా ఉంటూ చేయగలిగినంత మంచి చేస్తూ వెళితే జ్ఞానం కోసం మనం ఎదురు చూడనక్కరలేదు జ్ఞానమే మనకు ఎదురు వస్తుంది. అది పరోక్ష జ్ఞానంకాదు అపరోక్ష జ్ఞానము. పుస్తకాలు చదివి నేర్చుకొనేది పరోక్ష జ్ఞానము. నీ హృదయంలో ఉన్న వస్తువును డైరెక్టుగా అనుభవించటం అపరోక్ష జ్ఞానము. ఏ మనిషికి ఆమనిషి హింస పెట్టుకోకూడదు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మిమ్మల్ని మీరు హింస పెట్టుకొంటే దాని వలన కూడా అహంభావన పెరుగుతుంది. ఎవడైతే తన మనస్సును, బుద్ధిని సమానంగా ఉంచుకుంటున్నాడో వాడే యోగి. నీకు అనేక తలంపులు వస్తాయి. ఆ తలంపులు అన్నింటికి ఒక మూలతలంపు ఉంటుంది దానిని అహంభావన అని పిలుస్తారు. ఆమూలతలంపు యొక్క బలం తగ్గాలి. నీ అంతట నీవు సాధన చేసుకుంటూ, సత్పురుషులతో సహవాసం చేస్తూ ఉంటే దాని బలం తగ్గుతుంది. నీ సమర్ధతకు మించి ఏపని చేయలేవు. నీవు ఎంత వరకు చేయగలిగితే అంత వరకు చెయ్యి. నీ ప్రాణమును ఎలా కాపాడుకొంటున్నావో అంత కంటే ఎక్కువగా సత్పురుషుల సహవాసమును కాపాడుకో. అప్పుడు మూలతలంపు యొక్క బలం తగ్గుతుంది. దురాశ భగవంతుని వైపుకు నీ ముఖాన్ని తిరగనివ్వదు. అందు వలన ప్రయత్నం చేసి దురాశను విడిచి పెట్టాలి అన్నారు ఆచార్యులవారు.

మనస్సుతో విషయాలు నేర్చుకొన్నంత మాత్రం చేత జ్ఞానం రాదు నీ మనస్సు ఎంత నిజమో ఆ నేర్చుకొన్న విషయాలు కూడా అంతే నిజం. మనస్సు ఎక్కడైతే శేషం లేకుండా అణిగిందో అక్కడ జ్ఞానోదయం కలుగుతుంది, శాంతి ప్రవహిస్తుంది. నీ హృదయంలో ఉన్న సత్యంతో నీకు సహవాసము దొరికేవరకు బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసము చేయమని రమణాచార్యులు చెప్పారు కొంతమందికి భగవంతుడు కంటే భగవంతుడు కల్పించిన విషయాలు అంటే ఇష్టం. అందువలన ఆవిషయాలు గురించి అడుగుతారుకాని భగవంతుని గురించి అడగరు. లోక విషయాలతో, రాగ ద్వేషాలతో విసిగెత్తిపోయి నీవే కావాలి అని పరమేశ్వరుని ప్రార్ధిస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. లోకం మీద ఇష్టం పెట్టుకొని ఆయన్ని ప్రార్ధిస్తే మోసపోవటానికి శివుడు అమాయకుడు కాడు. నీవు గొప్పవాడివి అని పొగుడుతూ నీవే కావాలి అని నోటితో అడిగినా నీలోపల ఏది అంటే ఇష్టపడుతున్నావో అది ఈశ్వరుడు చూస్తూ ఉంటాడు. అంతర్యామిని మనం మోసం చేయలేము, తలంపు మన బ్రెయిన్‌లోనికి రాకముందే మనకు ఏతలంపు వస్తోందో ఆయన చూస్తూ ఉంటాడు అహంభావన అనే కిటికీలో నుండి చూస్తే, పుణ్యం, పాపం, జన్మలు, కర్మలు అన్ని ఉన్నాయి. ఆత్మ సింహాసనం మీద కూర్చొని చూస్తే ఏమీ లేదు. అంతా ఆత్మే నీవు పొందవలసినది ఏదో పొందు. అది పొందిన తరువాత మిగిలిన విషయాలు ఉంటే చూడవచ్చు. కొంతమంది ఎంతసేపు ఇంట్లో

కూర్చొని ఒకరిని ఒకరు పొగుడుకొంటూ ఉంటారు, రజోగుణం మాటలు చెప్పకొంటూ ఉంటారు. దీని వలన రజోగుణం పెరుగుతుందని వారికి తెలియదు. ఒక రూపాయి సంపాదించి పది రూపాయలు ఖర్చుపెడుతూ ఉంటే వాడి పరిస్థితి ఎలా ఉంటుందో మనం చేసే సాధన కూడా అలాగే ఉంది. ఎదో ఉదయం కొద్దిసేపు పూజ చేయటం, జపం చేయటం మిగిలిన కాలం అంతా రజోగుణం మాటలు చెప్పకోవటం, రజోగుణం పెంచే పనులు చేయటం ఇంక మనకు శాంతి ఏమిటి? జ్ఞానం ఏమిటి? ఆధ్యాత్మిక అభివృద్ధి ఎలా వస్తుంది.

గాఢ నిద్రలో నీకు దేహం గొడవలేదు, లోకం గొడవలేదు శాస్త్రం గొడవలేదు ఏ గొడవలేదు. కాని అక్కడ నీవు ఉన్నావు. దేహానికి సంబంధించిన, శాస్త్రానికి సంబంధించిన స్మృతి లేనప్పడు కూడా నువ్వు ఉన్నావు అన్న సంగతి ఎందుకు మర్చిపోతున్నావు. ఆ ఉన్నవాడు గురించి ఎందుకు ఆలోచించటం లేదు. వాడి గురించి ఎందుకు శ్రవణం చేయవు, మననం చేయవు, ధ్యానం చేయవు అని అడుగుతున్నారు. నీకు దేహ స్మృతి లేనప్పడు ఏదైతే ఉందో అదే అసలు వస్తువు. కాని అహంకారం అదే నేను అంటుంది. అంటే అసత్యమే సత్యం క్రింద నటిస్తోంది. ఆమనస్సే నీకు ఆత్మ అనిపిస్తోంది. నిజం కానిది చెప్పినట్లు జాగ్రదావస్థలో నీవు వ్యవహరిస్తున్నావు. మానవుడు అవసరానికంటే అహంకారం కోసం ఎక్కువ మాట్లాడతాడు. ఏదైతే పనికిరాదో అది ఎంతో విలువైనదని అనుకొంటున్నావు. నీవు మాట మాట్లాడితే దానికి కారణం ఏమిటి? ఆమాటలు యొక్క ప్రయోజనం ఏమిటి ? అవసరం ఉండి ఆమాటలు మాట్లాడుతున్నామా లేక వ్యక్తిగతమైన నేను పెరగటానికి మాట్లాడుతున్నామా అనేది చూసుకోవాలి. వ్యక్తి భావన విడిచి పెడితే అప్పడు లోపల ఉన్న వస్తువు మీ ద్వారా పని చేస్తుంది. అది సమాజం యొక్క శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది, మీకు క్షేమమును కలుగజేస్తుంది. గాలివానలో వచ్చే గాలి వలన మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతుంది. రజో గుణంలో ఉన్నవాడు చేసే పని గాలివానలో వచ్చే గాలిలాగ ఉంటుంది. కాని ఈశ్వరుడు చేసే పని అలాగ ఉండదు. వేసవికాలంలో చల్లనిగాలి శరీరాన్ని తాకుతూ ఉంటే ఎలా ఉంటుందో పరమేశ్వరుడు చేసే పని అలా ఉంటుంది.

నీ జీవితంలో అనేక మంచి పనులు చేయవచ్చు, చెడుపనులు చేయవచ్చు నిన్ను ఆడించేది ఆ మూల తలంపే అని జ్ఞాపకం పెట్టుకో. ఈ దేహం నాది అని ఈ దేహం మీద అభిమానం కలుగజేసేది ఆమూల తలంపే. స్నేహాలకు, విరోధాలకు ఆమూలతలంపే కారణం. ఆమూలతలంపు పడిపోతే అన్ని పడిపోతాయి. స్నేహాలు అతిగా చేయటం వలన బంధంలో పడతాము. అతి స్నేహం కూడా మత్తుతో సమానం. వారు ఎటు గంతు వేయమంటే అటు గంతు వేస్తాము. అతి స్నేహం వలన కాలం వృధా అవుతుంది. నేను అనే మూలతలంపు యొక్క మూలంలోనే భగవంతుడు ఉన్నాడు ఆ మూలతలంపు యొక్క మూలం చూస్తే ఈశ్వర సాక్షాత్కారం అవుతుంది. పునర్జన్మలేని స్థితికి ఎదిగి వెళ్ళి పోతాడు. మూలతలంపు యొక్క మూలమును ఎవరు చూస్తారంటే స్వాతికబుద్ధి ఉన్నవాడు, అంతర్దృష్టి ఉన్నవాడు చూడగలడు. ఎన్నో జన్మలలో సత్కర్మ చేస్తే గాని మనకు అంతర్దృష్టి కలుగదు. నిన్ను నీవు ఎంతగా ప్రేమించుకొంటున్నావో **అంతగా ఇతరులను** ప్రేమించినపుడు నీకు అంతర్దృష్టి కలుగుతుంది.

ఎదుటివారిలో ఒక మంచి గుణం ఉంటే అది దోషంగా కనిపిస్తుంటే అది అసూయ. మీలో ఉన్న మంచి నాకు చెడుగా కనిపిస్తూ ఉంటే నాలో అసూయ ఉన్నట్టు గుర్తు. అసూయ ఉన్నవాడు మూలంలో కుళ్ళిపోతాడు. దేహం లేకుండా, ప్రపంచం లేకుండా, విషయాలు లేకుండా, రాగ ద్వేషాలతో సంబంధం లేకుండా అసలు వస్తువు ఉండగలదు. అది లేకుండా ఇవి ఏమి ఉండ లేవు గాని ఇవి లేకుండా అది ఉండగలదు. ఎందుచేతనంటే అది స్వతంత్రమైనది. స్వతంత్రమైన వస్తువును తెలుసుకొన్నవాడు స్వతంత్రమైన సుఖమును పొందగలడు. ఇప్పడు మనకు ఉన్నది స్వతంత్రమైన సుఖం కాదు. జ్ఞానం ఎవరికి కలుగుతుంది అంటే ఇతరులను చూసేటప్పడు సుబ్బమ్మ , సుబ్బమ్మగా, ఎల్లమ్మ , ఎల్లమ్మగా, కనిపిస్తూ ఉంటే నీకు జ్ఞానం కలుగదు. ఎవరిని చూసిన లోపల ఉన్న సత్యవస్తువు నీకు కనిపిస్తూ ఉంటే నీకు జ్ఞానం కలుగుతుంది.

నీవు ఏదైతే కాదో దాని గురించి ఆలోచించకు. నీవు ఏదైతే అవునో దాని గురించి ఆలోచించు నీ సాధనా బలం 5 పైసలు అయితే అహంకార బలం 95 పైసలు. నీవు నిరంతరం ఆత్మ గురించి శ్రవణం చెయ్యి దానిని మననం చెయ్యి, దానినే ధ్యానం చెయ్యి. అలా చేస్తూ ఉంటే నీవు ఏదైతే కాదో దానికి దూరం అవుతావు ఏదైతే అవునో దానికి సమీపంలోనికి వస్తూ ఉంటావు. సత్యవస్తువుకు దగ్గర అవుతూ ఉంటే దానికి సంబంధించిన ఆనందం, శాంతి, జ్ఞానం నీకు అందుతాయి. నీ శరీరమును ఎంత జాగ్రత్తగా చూసుకొన్న అది ఏదో రోజు చనిపోతుంది అది చనిపోవటానికి పుట్టింది చావువేరు, పుట్టుక వేరుకాదు, చనిపోయాడు అంటే పుట్టాడు అని అర్థం పుట్టాడు అంటే చనిపోయాడు అని అర్థం. ఈ జననమరణ ప్రవాహం నుండి నిన్ను విడుదల చేయటానికి ఎవరు అయితే ప్రయత్నం చేస్తున్నాడో వాడే నిజమైన గురువు. నీవు ఆత్మను మరచి పోవటం వలన అనాత్మ గొడవలు వస్తున్నాయి. నీ స్వరూప చింతనను వదిలి వేయటం వలన లోకచింతన వస్తుంది అన్నారు భగవాన్. చాలా మంది సత్‌సంగములో కూర్చొంటారు. మొదట ఆత్మ చింతన మొదలు పెడతారు 5 నిమిషాల తరువాత లోక చింతన వచ్చేస్తుంది. సత్‌సంగములో లోకచింతన వస్తూ ఉంటే అక్కడ నుండి వెళ్ళి పోవటం మంచిది. భగవాన్ దగ్గర ఎవరైనా అక్కడ అలా ఉంది, ఇక్కడ ఇలా ఉంది అని చెబితే ఈ అనాత్మ గొడవలు నేర్చుకోవటానికా ఇంత దూరం వచ్చావు అనేవారు. ఆత్మకాని దానిని త్యాగం చేయకుండా ఆత్మను పొందలేవు. నీవు ఎవరో నీవు తెలుసుకొనే వరకు అహంభావన తీసుకొని వచ్చే చిక్కులు, క్లిష్ట పరిస్థితులు నిన్ను వెంటాడుతూనే ఉంటాయి. దాని ప్రభావం నుండి నీవు బయట పడాలంటే నీవు ఎవరో నీకు తెలియాలి. ఏనుగు ఎంత బలమైనది అయినా సింహానికి లొంగుతుంది. అహంకారము ఏనుగులాంటిది, నీలోపల ఉన్న చైతన్యము సింహంలాంటిది. అహంభావన ఎంత బలమైనది అయినా చైతన్యం దగ్గర అణిగి పోతుంది. నీమనస్సుకు ఆత్మ చింతన తప్ప ఇతర చింతనలకు కొంచెం కూడా అవకాశం ఇవ్వకుండా వుంటే నీమనస్సు నశిస్తుంది. దేహం ప్రారబ్దం ప్రకారము నడిచి ఏదోరోజు చనిపోతుంది. దేహం మంచి, చెడు ప్రారబ్దం రెండూ అనుభవిస్తూ ఉంటుంది. మంచి జరిగినప్పడు పొంగిపోకుండా, చెడు జరిగినప్పడు కృంగి పోకుండా మీరు సమానంగా ఉంటే మీకు సిద్ది కలుగుతుంది. ప్రారబ్దం యొక్క ప్రభావం మనస్సు మీద పడకుండా ఉంటే మనస్సు చైతన్యం వైపుకు ఉపసంహరింపబడుతుంది. మనస్సుకు అంతర్ దృష్టి కలుగుతుంది. ప్రారబ్దం యొక్క ప్రభావం నీమనస్సు మీద పడితే అది బాహ్యముఖానికి వచ్చేస్తుంది, రోడ్డు మీద ఉన్న